క్లుప్తంగా

భీమారంలో వివేక్‌కు ఘనస్వాగతం



స్వాగతం పలుకుతున్న ప్రజలు

భీమారం: అసెంబ్లీకి జరిగిన ఎన్నికల్లో విజయం సాధించిన గడ్డం వివేక్ ఆదివారం సాయంత్రం మండల కేంద్రానికి వచ్చిన నేపథ్యంలో కాంగ్రెస్ శ్రేణులు, ప్రజలు మంగళహారతులు, పుష్పగుచ్చాలు అందజేసి స్వాగతం పలికారు. ఈ మేరకు వివేక్ మాట్లాడుతూ.. ప్రజల సమస్యలను ఎప్పటికప్పుడు తెలుసుకొని వాటిని పరిష్కరిస్తానన్నారు. ఎన్నికల్లో ప్రజలకు కాంగ్రెస్ పార్టీ ఇచ్చిన ఆరు గ్యారెంటీలను అమలు చేయనున్నట్లు తెలిపారు. తనపై నమ్మకంతో ఓట్లు వేసి భారీ మెజార్టీతో గెలిపించిన చెన్నూర్ నియోజకవర్గ ప్రజలకు వివేక్ కృతజ్ఞతలు తెలిపారు. కాగా ఇందులో జిల్లా కాంగ్రెస్ నాయకులు పొడేటి రవి, చేకూర్తి సత్యనారాయణరెడ్డి, బుక్యా లక్ష్మణ్‌లతో పాటు పలువురు ఉన్నారు.

బీజేపీకి రాజీనామా

శ్రీరాంపూర్: బీజేపీకి రాజీనామా చేస్తున్నట్లు ఆ పార్టీ నస్పూర్ 3వ వార్డు నాయకుడు, బీఎంఎస్ కన్వీనర్ బరుపటి మారుతి ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. తన వార్డు నుంచి బీజేపీకి పరిపూర్ణ మెజారిటీ ఇవ్వనందుకు నైతిక బాధ్యత వహిస్తూ రాజీనామా చేస్తున్నట్లు ఆయన తెలిపారు. ఈ మేరకు పార్టీకి, యూనియన్ నాయకత్వానికి తన రాజీనామా పత్రాన్ని సమర్పించినట్లు తెలిపారు.

సమస్యల పరిష్కారం కోసం పోరాడాలి



మాట్లాడుతున్న ఆరుముల్లా రాజు

శ్రీరాంపూర్: సమస్యల పరిష్కారం కోసం అందరూ కలిసి పోరాడాలని సింగరేణి మజ్దూర్ అసోసియేషన్ అధ్యక్షుడు ఆరుముల్ల రాజు తెలిపారు. ఆదివారం శ్రీరాంపూర్‌లోని విశ్వశాంతి హైస్కూల్ మజ్దూర్ అసోసియేషన్ సమావేశం జరిగింది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. మజ్దూర్లపై పనిభారం పెరుగుతుందన్నారు. గనుల వారి సమస్యలను ఎక్కడికక్కడ పరిష్కారం కోసం పోరాడాలన్నారు. అధికారుల దృష్టికి సమస్యలను తీసుకెళ్లాలన్నారు. త్వరలోనే నూతన కమిటీలను ఎన్నుకోనున్నట్లు తెలిపారు. సమావేశంలో అసోసియేషన్ నాయకులు సురేందర్, ముస్కె ఈశ్వర్, అన్వేశ్, వెంకటేశ్, మల్లారపు మహేందర్, ధనరాజ్ పాల్గొన్నారు.

కాంగ్రెస్‌కే పల్లె ప్రజల మద్దతు

నెన్నెల: మండలంలోని 19గ్రామపంచాయతీల్లో మూడు గ్రామాలు తప్పా మిగితా 16 గ్రామపంచాయతీలు కాంగ్రెస్‌కే మద్దతు తెలిపాయి. బెల్లంపల్లి కాంగ్రెస్ అభ్యర్థి గడ్డం వినోద్‌కు మెజార్టీ అందించారు. మొత్తం మండలంలో కాంగ్రెస్ అభ్యర్థికి 3,192ఓట్ల ఆధిక్యత లభించింది. నెన్నెలలో కాంగ్రెస్ పార్టీ అభ్యర్థికి 423, నందులపల్లిలో 131, మన్నెగూడంలో 19, జోగాపూర్‌లో 90, గొల్లపల్లిలో 184, మైలారంలో 512, జంగాల్‌పేట ఖర్జీలో 230, కోణంపేటలో 271, కుశ్నపల్లిలో 161, ఆవుడంలో 528, కొత్తూర్‌లో 178, చిన్నవెంకటాపూర్‌లో 149, చిత్తాపూర్‌లో 168, గుండ్లసోమారంలో 86 కాంగ్రెస్‌కు లీడ్ రాగా గన్‌పూర్‌లో 6, జెండావెంకటాపూర్‌లో 52, నార్వాయిపేటలో 2ఓట్లు బీఆర్ఎస్‌కు ఆధిక్యం వచ్చింది. దీంతో మండలంలో మెజార్టీ పొందిన గ్రామాల్లో సంబురాలు జరుపుకున్నారు.

గూడెంలో కొనసాగుతున్న రద్దీ



దండేపల్లి: మండలంలోని గూడెం శ్రీసత్యనారాయణస్వామి ఆలయంలో కార్తీక మాసం ప్రారంభం నుంచి భక్తుల రద్దీ కొనసాగుతోంది. ఆదివారం భక్తులు అధికసంఖ్యలో వచ్చి సత్యదేవున్ని దర్శించుకున్నారు. 301 జంటలు సామూహిక సత్యనారాయణ వ్రతాలు ఆచరించారు. దీంతో ఆలయ ప్రాంగణంభక్తులతో సందడిగా మారింది.

డీజేల హోరు.. నృత్యాల జోరు



నస్పూర్ షిర్కేలో ఐఎన్టీయూసీ సంబురాలు



ముల్కల్లలో డీజే ఎదుట నృత్యం చేస్తూ..



పాత మంచిర్యాల వద్ద సంబురాలు



ముల్కల్లలో బెల్లంపల్లి ఎమ్మెల్యే వినోద్‌తో కార్యకర్తల హంగామా

- మంచిర్యాలలో ప్రేం సాగర్‌రావు, చెన్నూర్‌లో వివేక్, బెల్లంపల్లిలో వినోద్ గెలుపొందడంతో హర్షం వ్యక్తం చేసిన నాయకులు, కార్యకర్తలు
- ఊరూరా కాంగ్రెస్ విజయోత్సవ ర్యాలీలు
- కేక్ కట్ చేసి, టపాసులు కాలుస్తూ నాయకుల సంబురాలు

కాంగ్రెస్ విజయఢంకా మోగించింది. మంచిర్యాల నియోజకవర్గం నుంచి ప్రేం సాగర్‌రావు, చెన్నూర్ నుంచి వివేక్ వెంకటస్వామి, బెల్లంపల్లి నుంచి వినోద్, ఖానాపూర్ నుంచి వెడ్మ బొజ్జు విజయం సాధించారు. ఈ సందర్భంగా జిల్లా వ్యాప్తంగా కాంగ్రెస్ శ్రేణులు సంబురాలు జరుపుకున్నారు. కేక్ కట్ చేసి, టపాసులు కాల్చి సందడి చేశారు. డీజే చప్పుళ్ల మధ్య నృత్యం చేస్తూ, విజయోత్సవ ర్యాలీలు నిర్వహించారు.



మహిళలతో సంబురాలు జరుపుకొంటున్న డీసీసీ అధ్యక్షురాలు సురేఖ

మంచిర్యాలక్రైం: అసెంబ్లీ ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీ మంచిర్యాల ఎమ్మెల్యే అభ్యర్థిగా పోటీ చేసిన మాజీ ఎమ్మెల్సీ కొక్కిరాల ప్రేంసాగర్‌రావ్ ఘన విజయం సాదించడంతో జిల్లా కేంద్రంలో కాగ్రెస్ పార్టీ శ్రేణులు సంబురాలు చేసుకున్నారు. డీజేలతో ర్యాలీలు తీశారు. జై కాంగ్రెస్, జిల్లా టైగర్ ప్రేం సాగర్‌రావు నాయకత్వం వర్ధిల్లాలి అంటూ నినాదాలు చేస్తూ మధ్యాహ్నం ఒంటి గంట నుంచే సంబురాలు ప్రారంభించారు. పెద్ద సంఖ్యలో ప్రేం సాగర్‌రావ్ ఇంటికి చేరుకొని కాంగ్రెస్‌పార్టీ జిల్లా అధ్యక్షురాలు కొక్కిరాల సురేఖతో కలిసి విజయధ్వనులు చేస్తూ సంబురాల్లో గడిపారు. టపాసులు కాల్చి, స్వీట్లు పంచుకున్నారు. రంగులు చల్లుకొని విజయఢంకా మోగించారు.

శ్రీరాంపూర్: కాంగ్రెస్ పార్టీ గెలుపుపై ఐఎన్టీయూసీ నాయకులు సంబురాలు జరుపుకున్నారు. నస్పూర్ షిర్కేలో ఆ యూనియన్ నాయకులు, రిటైర్డ్ ఉద్యోగులు టపాసులు కాల్చి, మిఠాయిలు పంచారు. కార్యక్రమానికి ఆ యూనియన్ సెక్రెటరీ జనరల్ జనక్‌ప్రసాద్ హాజరయ్యారు. సింగరేణి ప్రాంత కార్మికులు కాంగ్రెస్ పార్టీ అభ్యర్థులను గెలిపించి నేడు రాష్ట్రంలో కాంగ్రెస్ పార్టీకి అధికారం కట్టబెట్టారన్నారు. ఐఎన్టీయూసీ శ్రేణులంతా కలిసి నేడు పార్టీ అభ్యర్థులను గెలిపించడం కోసం ఎంతగానో కృషి చేశారన్నారు. కార్యక్రమంలో ఆ యూనియన్ బ్రాంచీ ఉపాధ్యక్షుడు శంకర్‌రావు, సీనియర్ ఉపాధ్యక్షుడు కాంపెల్లి సమ్మయ్య, నర్సింహారెడ్డి, నాయకులు సీహెచ్ భీంరావు, గరిగే స్వామి, సమ్ము రాజయ్య, మోతె రాఘవరెడ్డి, భీంరవి, తిరుపతిరెడ్డి, సమ్మిరెడ్డి, బుస్స రమేశ్, కాలిపాక సమ్మయ్య పాల్గొన్నారు.

మంచిర్యాలరూరల్(హాజీపూర్): మంచిర్యాల నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ ఎమ్మెల్యేగా ప్రేంసాగర్‌రావు భారీ విజయంతో హాజీపూర్ మండలంలో సంబురాలు అంబురాన్నంటాయి. గెలుపు ఖరారు కావడంతో ముందుగానే సిద్ధ చేసుకున్న డీజే వాహనాలు, బ్యాండ్, మేళాలతో ఒక్కసారిగా సంబురాలు ప్రారంభించారు. పెద్ద ఎత్తున బాణాసంచా కాలుస్తూ ఆనందోత్సాహాల మధ్య నృత్యాలు చేస్తూ రంగులు జల్లుకుంటూ వాడవాడనా ర్యాలీగా వెళ్లారు. ఈ సందర్భంగా ప్రజలకు మిఠాయిలు పంపిణీ చేస్తూ ప్రేంసాగర్‌రావు విజయాన్ని అందరితో పంచుకున్నారు.

లక్సెట్టిపేట/దండేపల్లి/పాతమంచిర్యాల: జిల్లా కేంద్రంలోని శ్రీనివాస కాలనీలో, దండేపల్లిలో, లక్సెట్టిపేటలో కాంగ్రెస్ పార్టీ నాయకులు సంబురాలు చేసుకున్నారు. కాంగ్రెస్ అభ్యర్థి కే.ప్రేంసాగర్‌రావు మంచిర్యాల నియోజకవర్గ ఎమ్మెల్యేగా విజయం సాధించడంతో ర్యాలీలు నిర్వహించారు. అనంతరం మిఠాయిలు పంపిణీ చేసుకుని సంబురాలు చేసుకున్నారు. కార్యక్రమంలో కొత్తపల్లి రమేష్, సత్యనారాయణ, సిద్దం పోషం, బండారి రాజు, చుంచు సత్యనారాయణ, అంకతిబాపు, కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలు ఉన్నారు.



పాతమంచిర్యాల: స్వీట్లు పంపిణీ చేస్తూ...



దండేపల్లి లో సంబురాల్లో నాయకులు



దండేపల్లిలో కాంగ్రెస్ నాయకుల సంబురాలు



ముల్కల్లలో గెలుపొందిన ఎమ్మెల్యే ప్రేంసాగర్‌రావుతో పార్టీ కార్యకర్తల సందడి

బెల్లంపల్లిలో..

తాండూర్: బెల్లంపల్లి నియోజకవర్గ ఎమ్మెల్యేగా గడ్డం వినోద్ గెలుపొందడంతో కాంగ్రెస్ శ్రేణులు సంబురాలు చేసుకున్నారు. మండలంలోని కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలు మండల కేంద్రానికి చేరుకుని పెద్ద ఎత్తున బాణాసంచాలు కాల్చి, స్వీట్లు పంపిణీ చేసి హర్షం వ్యక్తం చేశారు. మోటార్ బైక్ ర్యాలీ నిర్వహించారు. విజయోత్సవ ర్యాలీలు చేపట్టి గడ్డం వినోద్ గెలుపునకు సహకరించిన ప్రతి ఒక్కరికీ ధన్యవాదాలు తెలిపారు. ఆయా కార్యక్రమాల్లో కాంగ్రెస్ పార్టీ జిల్లా ఉపాధ్యక్షుడు సూరం రవీందర్‌రెడ్డి, ఎంపీటీసీ సిరంగి శంకర్, మార్కెట్ కమిటీ మాజీ చైర్మన్ గట్టు మురళీధర్ రావు, సింగిల్ విండో వైస్ చైర్మన్ కదారి రత్నాకర్ రావు, పార్టీ మండల అధ్యక్షుడు ఈసా, మార్కెట్ కమిటీ మాజీ డైరెక్టర్ రంజిత్‌కుమార్, నాయకులు సూరం దామోదర్ రెడ్డి, నాయకులు శ్రీనివాస్, శంకర్ తదితరులు పాల్గొన్నారు.

బెల్లంపల్లిరూరల్: గడ్డం వినోద్ ఎమ్మెల్యేగా గెలుపొందడంతో కాంగ్రెస్ శ్రేణులు సంబురాలు జరుపుకున్నారు. మండలంలోని కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలు గ్రామాల్లో బాణాసంచాలు కాల్చి, స్వీట్లు పంపిణీ చేసి, విజయోత్సవ ర్యాలీలు చేపట్టి గడ్డం వినోద్ గెలుపునకు సహకరించిన ప్రతి ఒక్కరికీ ధన్యవాదాలు తెలిపారు. మాజీ జెడ్పీటీసీ రాంచందర్, మండల అధ్యక్షుడు సత్యనారాయణ, నాయకులు పాల్గొన్నారు.

భీమిని: బెల్లంపల్లి ఎమ్మెల్యేగా గడ్డం వినోద్ భారీ మెజార్టీతో గెలుపొందడంతో భీమిని, కన్నెపల్లి మండలంలోని గ్రామాల్లో కాంగ్రెస్ శ్రేణులు బాణాసంచా కాల్చి సంబురాలు జరుపుకున్నారు. కేక్‌లు కట్ చేసి మిఠాయిలు పంచుతూ గడ్డం వినోద్‌కు శుభాకాంక్షలు తెలిపారు. కన్నెపల్లి మండలంలోని కాంగ్రెస్ సీనియర్ నాయకుడు మాదవరపు నర్సింగరావు నివాసంలో ఎల్ఈడీ స్క్రీన్‌ద్వారా ఫలితాలను వీక్షించారు. విజయం సాధించడంతో నృత్యాలు చేసి సంబురాలు జరుపుకున్నారు. కార్యక్రమాల్లో భీమిని, కన్నెపల్లి మండలాల కాంగ్రెస్ మండల అధ్యక్షుడు గాదం లక్ష్మీనారాయణ, పప్పుల రామాంజనేయ, సీనియర్ నాయకులు శ్రీహరిరావు, రాకేష్‌శర్మ తదితరులు పాల్గొన్నారు.



తాండూర్: సంబురాల్లో కాంగ్రెస్ నాయకులు

నెన్నెల: గడ్డం వినోద్ విజయం సాధించడంతో నెన్నెల మండల కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలు సంబురాల్లో మునిగిపోయారు. బాణసంచా పేల్చి డీజే ముందు నృత్యాలు చేస్తూ గ్రామాల్లో విజయోత్సవ ర్యాలీలు నిర్వహించారు. మిఠాయిలు పంచి యువ నాయకులు నృత్యాలతో సందడి చేశారు. గ్రామాల్లో కాంగ్రెస్ పాటల జోరు వినిపించింది. కార్యక్రమంలో నాయకులు బొమ్మెన హరీష్‌గౌడ్, తోట శ్రీనివాస్, కిషన్‌రెడ్డి, మొహిద్‌ఖాన్, గట్టు మల్లేష్, గట్టు బానేష్, కొమ్ము రాజన్న, మంచర్ల వెంకటేష్, గజేందర్‌సింగ్, పోచిరెడ్డి, శంకరయ్య, గోవింద్‌సింగ్ పాల్గొన్నారు.

కాసిపేట: మండలంలోని పెద్దనపల్లి, దేవాపూర్, కాసిపేట, సోమగూడెం, ముత్యంపల్లి గ్రామాల్లో కాంగ్రెస్ విజయోత్సవ సంబురాలు ఘనంగా నిర్వహించారు. ఎమ్మెల్యేగా వినోద్ గెలుపొందడంతో పాటు రాష్ట్రంలో ప్రభుత్వం ఏర్పాటు చేసేందుకు సరిపడా స్థానాలు గెలుపొందడంతో నాయకులు టపాకాయలు కాల్చుతూ, డీజేలతో నృత్యాలు చేస్తూ ఊరేగింపులు నిర్వహించారు.

వేమనపల్లి: బెల్లంపల్లి ఎమ్మెల్యేగా గడ్డం వినోద్ భారీ మెజార్టీతో గెలుపొందడంతో వేమనపల్లి మండలంలో సంబురాలు అంబరాన్నంటాయి. ఎంపీటీసీ సంతోష్‌కుమార్, కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు సాబీర్ అలీ ఆధ్వర్యంలో మండల కేంద్రంతో పాటు నీల్వాయి, కేతన్‌పల్లి, ముల్కలపేట, సుంపుటం గ్రామాల్లో విజయోత్సవ ర్యాలీ నిర్వహించారు. అడుగడుగునా మహిళలు పూలు చల్లుతూ మంగళహారతులిచ్చారు. డీజే చప్పుళ్లతో సందడి చేశారు. ర్యాలీలో డీజే వాహనం మొరాయించడంతో 4 కిలోమీటర్ల దూరం కార్యకర్తలే వాహనాన్ని నెడుతూ డీజే చప్పుళ్లకు అనుగుణంగా నృత్యాలతో హోరెత్తించారు. చివరికి ట్రాక్టర్‌ను తీసుకొచ్చి వాహనాన్ని లాగుతూ నృత్యాలు చేశారు. కార్యక్రమంలో మండల కో ఆప్షన్ సభ్యుడు ముజ్జు, సర్పంచ్‌లు మధు, దుర్గక్క, మాజీ సర్పంచ్‌లు రాంచందర్, కిష్టయ్య, మాజీ వైస్ ప్రెసిడెంట్ రాజన్న, మాజీ జెడ్పీటీసీ లచ్చయ్య పాల్గొన్నారు.



వేమనపల్లిలో విజయోత్సవ ర్యాలీ



మాలగురిజాలలో సంబురాలు



సోమగూడెంలో నినాదాలు చేస్తున్న నాయకులు



కొండపూర్‌యాపలో కేక్ కట్ చేస్తూ...

చెన్నూర్‌లో..



ఇందారంలో విజయోత్సవ ర్యాలీ



భీమారంలో సంబురాల్లో పాల్గొన్న నాయకులు

మందమర్రిరూరల్: చెన్నూర్ నియోజకవర్గంలో కాంగ్రెస్ అభ్యర్థి వివేక్ ఎమ్మెల్యేగా విజయం సాధించడంతో కాంగ్రెస్ శ్రేణుల్లో ఆనందం నెలకొంది. పట్టణంలోని పలు వార్డుల్లో ఎక్కడికక్కడ పార్టీ శ్రేణులు టపాసులు కాల్చి, మిఠాయిలు పంపిణీ చేసి సంబురాలు జరుపుకున్నారు. యువకులు మోటార్ సైకిళ్లపై తిరుగుతూ కాంగ్రెస్ జిందాబాద్, ఎమ్మెల్యే వివేక్ నాయకత్వం వర్ధిల్లాలి అంటూ నినాదాలు చేశారు. పలు చోట్ల డీజేల సౌండ్స్ ఏర్పాటు చేసుకుని నృత్యాలు చేశారు.

భీమారం: వివేక్ విజయం సాధించినందుకు కాంగ్రెస్ నాయకులు భీమారం మండల కేంద్రంలో జాతీయరహదారిపై టపాసులు పేల్చి సంబురాలు జరుపుకున్నారు. అనంతరం మండల కేంద్రంలోని వీధుల్లో కాంగ్రెస్ జెండాలతో బైక్ ర్యాలీ నిర్వహించారు.

జైపూర్: మండల వ్యాప్తంగా కాంగ్రెస్ పార్టీ శ్రేణులు సంబురాలు జరుపుకున్నారు. గడ్డం వివేక్‌వెంకటస్వామి భారీ మెజార్టీతో గెలుపొందగా కాంగ్రెస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు, యువకులు టపాసులు కాల్చి, స్వీట్లు పంపిణీ చేసి విజయోత్సవ ర్యాలీలు నిర్వహించారు. మండల కేంద్రంతో పాటు ఇందారం, రామారావుపేట, షెట్‌పల్లితో పాటు అన్ని గ్రామాల్లో విజయోత్సవ ర్యాలీలు నిర్వహించగా జైపూర్‌లో నిర్వహించిన విజయోత్సవ ర్యాలీలో గడ్డం వివేక్‌వెంకటస్వామి పాల్గొన్నారు.

రామకృష్ణాపూర్: చెన్నూర్ నియోజకవర్గ కాంగ్రెస్ అభ్యర్థి గడ్డం వివేక్ భారీ మెజార్టీతో గెలుపొందడంతో ఆ పార్టీ శ్రేణులు సంబురాలు జరుపుకున్నారు. స్థానిక సూపర్‌బజార్ సెంటర్లో టపాసులు కాల్చిన అనంతరం పట్టణంలో ర్యాలీ చేపట్టారు. నాయకులు అబ్దుల్‌అజీజ్, పలెరాజు, వొడ్నాల శ్రీనివాస్, యాకుబ్‌అలీ పాల్గొన్నారు.



మందమర్రిరూరల్: నినాదాలు చేస్తూ...



ఆర్‌కేపీలో సంబురాలు

ఖానాపూర్‌లో...

జన్నారం: అసెంబ్లీ ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీ అభ్యర్థి వెడ్మ బొజ్జు విజయం సాధించడంతో పాటు, రాష్ట్రంలో కాంగ్రెస్ పార్టీ అధిక సీట్లు గెలువడంపై హర్షం వ్యక్తం చేస్తూ కాంగ్రెస్ పార్టీ నాయకులు సంబురాలు జరుపుకున్నారు. మండల కేంద్రంలో కాంగ్రెస్ పార్టీ జిల్లా ప్రధాన కార్యదర్శి గుర్రం మోహన్‌రెడ్డి, సీనియర్ నాయకులు రాజశేఖర్, ఏనుగు శుభాష్‌రెడ్డి, రియాజోద్దీన్‌లతో పాటు కలమడుగు ఉప సర్పంచ్ రాజుగౌడ్, మాల సంఘం అధ్యక్షుడు పాత బాలరాజు, కార్యకర్తలు సంబురాలు జరుపుకున్నారు. కలమడుగులో అంబేద్కర్ విగ్రహానికి కాంగ్రెస్ పార్టీ నాయకులు పూలమాలలు వేశారు. అనంతరం ర్యాలీ చేసి సంబురాలు జరుపుకున్నారు. నియోజకవర్గ ప్రజలు ఆదరించి కాంగ్రెస్ పార్టీ అభ్యర్థి వెడ్మ బొజ్జును గెలిపించడంపై ధన్యవాదాలు తెలిపారు.



జన్నారం: సంబురాల్లో కాంగ్రెస్ నాయకులు

ఎన్నికల ఫలితాలపై ఆసక్తి



నాయకులతో కలిసి వీక్షిస్తున్న రఘునాథ్‌రావు



దండేపల్లిలో ఓ ఇంట్లో...



భీమినిలో ఎల్‌ఈడీ స్క్రీన్‌లో వీక్షిస్తూ..

మందమర్రిరూరల్/జన్నారం/మంచిర్యాలక్రైం/మంచిర్యాలరూరల్(హాజీపూర్)/పాతమంచిర్యాల/దండేపల్లి: రాష్ట్ర అసెంబ్లీ ఎన్నికల ఫలితాలపై జిల్లా ప్రజలు ఆసక్తి కనబరిచారు. ఎన్నికల ఫలితాలు ఆదివారం వెలువరించడంతో ప్రజలు ఇళ్లల్లో టీవీల్లో వీక్షించారు. కొందరు ఆటోల వద్ద చూస్తూ కనిపించారు. కొంతమంది మార్కెట్ వ్యాపారస్తులు అందుబాటులో ఉన్న టీవీల్లో తిలకిస్తూ ఎప్పటికప్పుడు ఎన్నికల ఫలితాలను తెలుసుకున్నారు. మంచిర్యాలలో ఎమ్మెల్యే అభ్యర్థుల ఇంటి ఎదుట ఎల్‌ఈడీ స్క్రీన్లు ఏర్పాటు చేయగా నాయకులు వీక్షించారు.



దండేపల్లిలో ఆటోలో కూర్చొని సెల్‌ఫోన్‌లో ఫలితాలను వీక్షిస్తున్న ప్రజలు